

హంద్రీకి నీటి విడుదల

● జీడీపీ 4వ గేటు ద్వారా 2వేల క్యూసెక్కులు



గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని హంద్రీకి విడుదల చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ) నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. 4వ గేటు ద్వారా 2వేల క్యూసెక్కుల నీటిని హంద్రీ నదికి అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 4.5టీఎంసీలు. ఎగువ ప్రాంతాల నుంచి శని, ఆదివారం ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో 500 క్యూసెక్కులకు నీటి విడుదలను తగ్గించారు. మరోసారి ఇన్‌ఫ్లో పెరగడంతో సోమవారం 4వ గేటు ద్వారా 2000 క్యూసెక్కుల నీటిని హంద్రీకి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు.

మహాగౌరిగా భ్రమరాంబికాదేవి

శ్రీశైలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల పుణ్యక్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. నవదుర్గ అలంకారాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని ఎనిమిదో రోజు మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. నవదుర్గ మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతోంది. ఈదేవి తెల్లని వస్త్రాలను ధరించి, చతుర్భుజాలను కలిగి ఉంటుంది. కుడివైపు పైభుజంలో త్రిశూలాన్ని కింది భుజంలో అభయ హస్తాన్ని, ఎడమవైపు పైభుజంలో వరముద్రను, కింది భుజంలో ఢమరుకాన్ని కలిగి ఉంటుంది. మహాగౌరి తన పార్వతీరూపంలో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయసాగింది. ఈ తపస్సు కారణంగా ఈమె శరీరమంతా నల్లబడింది. ఆ తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు ఈమె శరీరంపై గంగాజలాన్ని చిలకరించాడు. అప్పుడు ఆదేవి తేజోవంతమైన గౌరవర్ణంతో అలరారింది. అందుకే ఈదేవి మహాగౌరిగా పిలువబడింది. ఈ దేవిని పూజించడంతో సకల పాపాలను నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని చెప్పబడుతోంది.

నంది వాహనంపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు

సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నటరాజ కళా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, గుంటూరు వారిచే సంప్రదాయ నృత్యం, రాత్రి 8గంటల నుంచి వి.లక్ష్మి సునీత వారి బృందంతో భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది.

గ్రామోత్సవం రద్దు

ఆది దంపతులను ప్రత్యేక అలంకరణలో నంది వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఉత్సవం నిర్వహించారు. అయితే వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. కళారూపాలు, వేషధారణలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు సిద్ధిదాయిని అలంకరణ

తొమ్మిదో రోజు మంగళవారం అమ్మ వారు సిద్ధిదాయిని అలంకరణలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు కైలాస వాహనంపై విహరించనున్నారు.



భక్తుల రద్దీ

శ్రీశైల క్షేత్రంలో భక్తులతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేశారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, దర్శనాల ద్వారా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు ముందస్తుగా తీసుకున్న భక్తులకు రెండు విడతలుగా స్పర్శ దర్శనానికి అధికారులు అనుమతిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ఆదోని ప్రజలకు గత పాలకుల పాపాలు.. వైఫల్యాలు వెంటాడుతున్నాయి. పట్టణంలో ప్రవహించే వంకలు ఎక్కడికక్కడే ఆక్రమణలకు గురయ్యాయి. వంకలు.. వాగులు కనుమరుగై డ్రైనేజీలుగా మారాయి. అధికారులు, గత పాలకులు కళ్లకు గంతలు కట్టుకోవడంతో సహజ నీటి వనరులు ఆనవాళ్లు కోల్పోయాయి. ఎడతెరిపిలేని వర్షాలకు వాగులు, వంకలు ఉరక లెత్తడంతో కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఇంతటి దారుణానికి ప్రధాన కారణం అక్రమణలే. గతంలో వైసీపీ ముఖ్య నాయకుడు ఒకరు తిరుమలనగర్ వద్ద వాగు సహజ ప్రవాహ మార్గాన్నే మళ్లించి డ్రైనేజీగా మార్చేశారు. ఆక్రమణ, కబ్జాదారుల్లో బడాబాబులు, రాజకీయ పలుకుబడి కలిగిన ప్రముఖులు ఉండడంతో తొలగించాల్సిన అధికార యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకుంది. వానా కాలమొస్తే ప్రజలకు నరకం చూపించే ఆక్రమణల బాగోతంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ముంచేశారు..!

- ఆదోనిలో రాంజల కడగమ్ము, ఆవుదూడ, మేక వంకలు
- ఎక్కడికక్కడే ఆక్రమణలు
- వంకలు కాస్త డ్రైనేజీలుగా మారిన వైనం
- జడివానలకు జలదిగ్బంధంలో పలు కాలనీలు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం, పాలకులు

కర్నూలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపాలిటీకి 165 ఏళ్ల చరిత్ర ఉంది. మండిగిరి, సాదాపురం, కల్లుబావి, పర్వతాపురం పట్టణానికి పరిసర గ్రామాలుగా ఉన్నాయి. పట్టణం పారిశ్రామిక, వాణిజ్యంగా ఎంతో అభివృద్ధి చెందింది. జనాభాతో పాటుగా కాలనీలు విస్తరించాయి. పర్వతాపురం, కల్లూబావి గ్రామాలు పురపాలక సంఘంలో విలీనం చేశారు. మండిగిరి, సాదాపురం గ్రామాలు పట్టణంలో అంతర్భాగం అయ్యాయి. ప్రస్తుతం జనాభా 3లక్షలు దాటిందని, 45వేలకు పైగా నివాసగృహాలు చేరాయని అధికారులు అంచనా.



ఆదోని పట్టణం తిరుమల నగర్ వద్ద జలమయమైన ప్రధాన రహదారి

ఒకప్పుడు శివారులో ప్రవహించే రాంజల కడగమ్ము, శాంతమల్లప్ప, మేక, ఆవుదూడ వంకలు ప్రస్తుతం పట్టణంలో అంతర్భాగం అయ్యాయి. పరిసరాల్లో హౌసింగ్ బోర్డు, ఎన్జీవో, పోస్టల్ కాలనీ, తిరుమలనగర్, గాంధీనగర్, కపర్దినగర్ ఇలా విలాసవంతమైన కాలనీలు విస్తరించాయి. కాలనీలతో వంకలు, వాగులు ఆక్రమణలకు గురై కుచించుకుపోయి ఆనవాళ్లు కోల్పోయాయి.

మిగతా 7వ పేజీలో

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీలను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌కు సంబంధించి ఆదోని సబ్‌కలెక్టర్ వద్ద 9, కర్నూలు ఆర్డీవో వద్ద 8, పత్తికొండ ఆర్డీవో వద్ద 2, కలెక్టరేట్ ఏవో వద్ద 3, జిల్లా రిజిస్ట్రార్, డీఎంహెచ్‌వో, డీఆర్డీఏ పీడీ, పంచాయతీరాజ్, ఏపీఐఐసీ జెడ్‌ఎంల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలన్నారు. అలాగే గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించ లేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాకు 57 విలేజ్ క్లినిక్స్ మంజూరు

పీఆర్ ఎస్ఈ వేణుగోపాల్



కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 57 విలేజ్ క్లినిక్స్ మంజూరైనట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు ఐ.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం జడ్పీ ఆవరణలోని పీఆర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుస్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీహెచ్ఐఎం) నిధులతో ఈ విలేజ్ క్లినిక్స్ భవనాలను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ భవన నిర్మాణాలకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే గత ప్రభుత్వంలో జిల్లాకు హెల్త్ క్లినిక్స్ 354 మంజూరు అయ్యాయని, వీటిలో 135 భవన నిర్మాణాలను పూర్తి చేసి వైద్య, ఆరోగ్య శాఖకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే రూఫ్ లెవెల్, రూఫ్ లెయిడ్ దశలో ఉన్న 76 భవన నిర్మాణాలను నేషనల్ హెల్త్ మిషన్ కింద పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. మరో 30 భవన నిర్మాణాలను కూడా ప్రధాన మంత్రి ఆయుస్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ నిధులతో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో టెండర్లను పిలుస్తామని ఎస్ఈ వివరించారు.

మొరాయించిన ఈనామ్ సర్వర్

• మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిచిన టెండర్లు
• ఆలస్యంగా తూకాలు
7

జామకు పండు ఈగ బెడద
6

ఏసీబీ వలలో ఆర్‌అండ్‌బీ ఏఈ

కాంట్రాక్టర్ నుంచి రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారుల అదుపులో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ఏఈ దూదేకుల దస్తగిరి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ రోడ్లు, భవనాల శాఖ ఏఈ దస్తగిరి సోమవారం ఏసీబీ వలకు చిక్కాడు. సత్యసాయి జిల్లాకు చెందిన ప్రైవేట్ కాంట్రాక్టర్ రమేశ్ పట్టణంలోని చింతకుంట రోడ్డులో ఓఎఫ్‌సీ కేబుల్ వేయడానికి నంద్యాల ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో డబ్బులు చెల్లించి రోడ్ కటింగ్ పర్మిషన్ తీసుకున్నారు. ఈ పనులు ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ఏఈ దూదేకుల దస్తగిరి సమక్షంలో చేయాల్సి ఉంది. ఇందుకోసం కాంట్రాక్టర్ ఏఈని సంప్రదించారు. అయితే ఈ పనులు చేసుకోవాలంటే తనకు రూ.70 వేలు లంచం ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేశాడు. అంత డబ్బులు ఇచ్చుకోలేనని, రూ.55 వేలు ఇస్తానని కాంట్రాక్టర్ ఒప్పుకొన్నారు. ఈ మేరకు రూ.40 వేలు నాలుగు రోజుల క్రితం ఏఈకి ఇచ్చారు. మిగతా రూ.15 వేలు ఇవ్వాలని ఏఈ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో కాంట్రాక్టర్ కర్నూలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతృత్వంలో అధికారుల బృందం రంగంలోకి దిగింది. ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి ఏఈ రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు రాజా ప్రభాకర్, కృష్ణయ్య, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

'కొలనుభారతి'కి పోటెత్తిన భక్తులు

210 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితులు

కొత్తపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని కొలనుభారతి పుణ్యక్షేత్రంలో సోమవారం అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి మూల నక్షత్రం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు చారు గోషిణి నదిజలాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం 210 మంది చిన్నారులకు అక్షర బీజాక్షర క్రతువులు నిర్వహించారు.



చక్రవర్తులపల్లెలో సాగు చేసిన తైవాన్ జామ

జామకు పండు ఈగ బెడద

- భారీగా తగ్గిన దిగుబడి
- నాడు 400 ఎకరాలు.. నేడు 60 ఎకరాలు
- వైరస్‌తో దెబ్బతిన్న తోటలు
- ఆందోళనలో అన్నదాతలు

చాగలమర్రి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జామ తోటలను పండు ఈగ తినేస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించడం లేదు. పండు ఈగలతో జామ దిగుబడి భారీగా తగ్గి నష్ట పోయే పరిస్థితి నెలకొంది. దెబ్బ తిన్న జామకాయలను పొలాల గట్ల వెంట పడేస్తున్నారు. ఇప్పటికే చేసిన అప్పులకు తోడు తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడానికి ఇంకెంత అప్పు చేయాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.



పండుగ ఈగ నివారణ కోసం బుట్టలు కడుతున్న రైతు

జిల్లాలో నాడు 300 ఎకరాల్లో..

జిల్లాలో నాడు 300 ఎకరాల్లో జామ తోటలు సాగు చేయగా నేడు 60 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లో 60ఎకరాల దాక తోటలను సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టారు. జామ కాయలు కోత సమయానికి పండు ఈత సోకి పండు దెబ్బతిని కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

లక్షలాది రూపాయలు పెట్టుబడి..

జామ తోటలు సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఏడాదిపాటు కాపాడుకుంటూ వచ్చినా కోత సమాయానికి దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 800మొక్కలు నాటారు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా 3టన్నులు మాత్రమే వస్తున్నాయి. రైతులు జామతోటలనే తొలగిస్తున్నారు. పండు ఈగ నివారణకు ఎన్ని మందులు పిచికారిచేసిన ప్రయోజనం లేకపోవడంతో ఆయా గ్రామాల్లో జామతోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లతో..

జామకాయను పండు ఈగ తినకుండా ప్లాస్టిక్ కవర్లు తొడిగారు. ఎకరాకు 200బాక్సుల కవర్లు కొనుగోలు చేసి జామకాయలను పురుగు తినకుండా కాపాడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. పండు ఈగ నివారణ కోసం రైతులే తమ సొంత ఆలోచనలతో రూ.180 విలువ చేసే ప్లాస్టిక్ బుట్టలను కొనుగోలు చేసుకొని జామ చెట్ల వద్ద ఉంచుతున్నారు. దీంతో పండు ఈగ, వివిధ పక్షులు తినకుండా రక్షణ కవచంలా ఉంటున్నాయని రైతులు పేర్కొన్నారు. 4 ఎకరాల్లో జామ కాయలకు కవర్ల కోసం ఖర్చు రూ.1.20 లక్షలు ఖర్చుచేశారు. పండుఈగ నివారణ కోసం ఎకరాకు 10 నుంచి 20 బుట్టలు ఏర్పాటు చేయడంతో ఆ బుట్టలో పండుఈగలు బుట్టలో పడుతుండటంతో కాయలకు ఈగబెడద తగ్గిందన్నారు. ప్రస్తుతం టన్ను దర రూ.30 వేలు పలుకుతున్న దిగుబడి లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



బాక్సులకు నింపిన జామ కాయలు

ధర ఉన్నా దిగుబడి లేక..

జామకాయలు పండించినా దిగుబడి లేక నష్టపోవాల్సి వస్తోంది. ఏడాది పాటు జామచెట్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట కోత సమయంలో దిగుబడి తగ్గి నష్టపోతున్నారు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 3 టన్నులు మాత్రమే వస్తున్నాయి. ధర ఉన్నా దిగుబడి లేక నష్టపోవాల్సి వస్తోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగుళ్లతో నష్టపోతున్నాం



తైవాన్ జామకు తెగుళ్ల సోకి దెబ్బతింటోంది. నాలుగెకరాల్లో జామ తోట సాగుచేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పండు ఈగ నివారణకు కవర్లు కొనుగోలు చేసి కాయలకు తొడిగి ఈగ నుంచి కాపాడుకుంటున్నా. రూ.1.20 లక్షల దాక కవర్ల కోసం ఖర్చు చేస్తున్నా. ● రవీంద్రారెడ్డి, రైతు, చక్రవర్తులపల్లె

ఉద్యాన పంటలకు రాయితీ ఇవ్వాలి



వైరస్ వల్ల జామతోటలు దెబ్బతింటున్నాయి. కోతకొచ్చే సమయంలో పండును ఈగ తినేస్తోంది. ఎన్ని మందులు వాడిన తెగుళ్ల ఉధృతి తగ్గలేదు. ప్రభుత్వం స్పందించి ఉద్యాన పంటల రాయితీ, పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు మంజూరు చేయాలి. -పుల్లయ్య, రైతు, ముత్యాలపాడు

స్త్రీ పథకంలో కార్మికులు నమోదు కావాలి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పరిశ్రమల వరకు పనిచేస్తున్న కార్మికులంతా స్త్రీ, క్షమాభిక్ష పథకాల్లో తప్పనిసరిగా నమోదు కావాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో జరిగిన సమావేశంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్‌ఐసీ) తిరుపతి డిప్యూటీ డైరెక్టర్ కృష్ణకుమార్ ఈఎస్‌ఐసీ సామాజిక భద్రతా పథకం ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేతనం రూ.21 వేల లోపు ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకంలో నమోదు చేసుకోవచ్చన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఈ పథకంలో భాగం కావచ్చని తెలిపారు. ఉద్యోగి వేతనం నుంచి 0.75 శాతం, పరిశ్రమ యాజమాన్యం నుంచి 3.25 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగి అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నప్పటికీ వేతనం చెల్లింపుతో పాటు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. మహిళా ఉద్యోగుల కోసం ప్రసూతి ప్రయోజనం కింద గరిష్ఠంగా 26 వారాల పాటు 100 శాతం సగటు రోజువారీ వేతనం చెల్లిస్తారన్నారు. తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వైకల్యం ఏర్పడితే అశక్తత ప్రయోజనం రూపంలో నెలవారీ చెల్లింపు లభిస్తుందన్నారు. ఉద్యోగి మరణిస్తే అతని ఆధారితులకు నెలవారీ పింఛన్ అందిస్తారన్నారు. అలాగే పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదికి రూ.120 రుసుము చెల్లించి వైద్య సదుపాయం పొందవచ్చన్నారు. కుటుంబంలో అమ్మాయికి వివాహం అయ్యే వరకు, అబ్బాయికి 21 ఏళ్ల వరకు ఈ వైద్య సదుపాయాలు లభిస్తాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 8 శాతం మంది మాత్రమే ఈ పథకంలో నమోదయ్యారని, పూర్తి స్థాయిలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి: జేసీ

జీఎస్టీ యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమైన శాఖల వారీ షెడ్యూల్‌ను అక్టోబరు 19 వరకు కొనసాగించాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ద్వారా వినియోగదారులకు లభించే ప్రయోజనాలను వివరించే కరపత్రాలను, జిల్లా వాటర్ బులెటిన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

చౌడేశ్వరి సేవలో దేవదాయశాఖ ఆర్జేసీ



చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

బనగానపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయాన్ని దేవదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. నందవరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు, వేద పండితులు తీర్థప్రసాదాలు అందించారు.

'నవ్యాంధ్ర'లో పెట్టుబడులు పెట్టండి

దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తలతో మంత్రి బీసీ



దక్షిణ కొరియాలో పారిశ్రామికవేత్తలతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి నారాయణ

బనగానపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో పెట్టుబడులు పెట్టాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణ కోరారు. దక్షిణ కొరియాలోని సియోల్‌లో రెండోరోజైన సోమవారం పలువురు పెట్టుబడిదారులు, వివిధ కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. ప్రపంచంలోని అతిపెద్ద చిప్‌లు, ఫ్లాష్ మెమోరీ చిప్‌లు సరఫరాదారులైన ఎస్‌కే హైనిక్ సెమీకండక్టర్ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఏపీలో మెమోరీ మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టే సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. అలాగే ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్- సౌత్‌కొరియా బిజినెస్ ఫోరం పార్టనర్‌షిప్ సమ్మిట్ షో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ఏపీలో 156 ప్రాజెక్టుల ద్వారా రూ.10లక్షలకు పైగా పెట్టుబడులు సాధించడంతో పాటు 8లక్షల ఉద్యోగాలు సృష్టించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులకు ఒక గమ్యస్థానం ఆంధ్రప్రదేశ్ అని వివరించారు. ఏపీలో పోర్టులు ఇప్పటికే తూర్పుతీరంలో 30శాతం కార్గో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 4 కొత్త గ్రీన్‌ఫీల్డు పోర్టులు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ ఏడాదికి అదనంగా 353 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యాన్ని జోడించగలవన్నారు. క్వాంటం సిస్టంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రాజధాని అమరావతిలో 44వేల ఎకరాల్లో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

గుంతకల్లు, నంద్యాల మధ్య అదనపు ఓహెచ్ లైన్ ఏర్పాటు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆధునికీకరణలో భాగంగా గుంతకల్లు - నంద్యాల మధ్య అదనపు ఓహెచ్ లైన్ ఏర్పాటుకు త్వరితగతిన పనులు ప్రారంభిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఎక్కువ రైళ్లు నడపడం కోసం పలు సెక్షన్లలో 25కేవీ లైన్ నుంచి మరో 25కేవీ లైన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు గుంతకల్లు - నంద్యాల సెక్షన్‌లో ఈ అదనపు లైన్ సదుపాయం కల్పించనున్నారు. ప్రస్తుతం రెండు సబ్ స్టేషన్ల మధ్య రెండు గూడ్స్ రైళ్లను మాత్రమే అనుమతిస్తారు. అయితే అదనపు లైన్ ఏర్పాటు చేయడంతో ఎక్కువ రైళ్లు నడపడానికి అవకాశం ఉంది.



నందవరంలో మహాగౌరీమాత అలంకారంలో చౌడేశ్వరీమాత



మహానందిలో మహాగౌరి దుర్గ అలంకరణలో కామేశ్వరీదేవి



కె.నాగలాపురంలో సరస్వతి దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు



కర్నూలు చిన్న అమ్మవారిశాలలో సరస్వతి దేవి అలంకరణ



మంత్రాలయంలో సరస్వతీదేవి అలంకరణలో మంచాలమ్మ అమ్మవారు



గీతా మందిరంలో సరస్వతి దేవి అలంకరణ

మహానందిలో మహాగౌరిగా కామేశ్వరీదేవి


మహానంది, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేదపండితులు, రుత్విక్కులు దాతల చేత చండీయాగం, హోమాలను నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి కామేశ్వరీదేవిని మహాగౌరి దుర్గగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను వేదమంత్రాలతో నిర్వహించారు. ఉత్సవం ముందు చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. క్షేత్రంలో కురుస్తున్న భారీ వర్షం కారణంగా సోమవారం రాత్రి ఆలయ మాడవీధులగుండా నిర్వహించే శేషవాహన గ్రామోత్సవాన్ని రద్దు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి తెలిపారు.

వివిధ రూపాల్లో అమ్మవారు

కర్నూలు కల్చరల్/ మంత్రాలయం/ గూడూరు/బనగానపల్లె/ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్మాత, ఆది పరాశక్తి అయిన దుర్గాదేవిని నిత్యం స్మరిస్తూ ఉమ్మడి జిల్లావాసులు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా కొనసాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలు, ప్రసిద్ధ ఆలయాలతోపాటూ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు (అమ్మవారిశాలలు), శైవ క్షేత్రాలు, ధార్మిక కేంద్రాల్లో అమ్మవారికి శోడశోపేత పూజలతో, నిత్య నైవేద్యాలతో, అర్చనాది హారతులతో కొలిచి తరిస్తున్నారు. జగజ్జననికి సాయంత్రం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. దేవీ నవరాత్రుల్లో 8వ రోజును అమ్మవారు మహాసరస్వతి దేవిగా భక్తులను కటాక్షిస్తారు. సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో మూలా నక్షత్ర పూజలు, చిన్నారులతో సరస్వతి దేవి పూజలు చేపట్టారు. దేవీ నవరాత్రుల్లో దుర్గాదేవి మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అనే త్రిశక్తి స్వరూపిణిగా కొలువై ఉంటుంది. ఈ నేపథ్యంలో మూలా నక్షత్రం రోజున మహా సరస్వతిగా అమ్మవారు దర్శనం ఇస్తారు.

● మంత్రాలయంలో మంచాలమ్మ అమ్మవారు సరస్వతీదేవిగా మయూర వాహనంపై దర్శనం ఇచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. గూడూరు మండలంలోని మండలంలోని కె.నాగలాపురంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు ఎనిమిదో రోజు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పాల్గొన్నారు. బనగానపల్లె మండలంలోని నందవరంలోని చౌడేశ్వరీమాత మహాగౌరీమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగుల హరివిల్లు



శ్రీశైలం జలాశయం గేట్ల గుండా గంగమ్మ సాగిపోతుండగా ఈ సుందర దృశ్యాన్ని చూసి పర్యాటకులు సందడి చేశారు. సోమవారం ఎగిసిపడుతున్న గంగమ్మపై రంగురంగుల హరివిల్లు మెరిసింది. ఎంతో అద్భుతంగా వెలిసిన ఈ ముగ్ధ మనోహర దృశ్యాన్ని చూసి తన్మయంతో మైమరిచిపోయారు. ● శ్రీశైలం, ఆంధ్రజ్యోతి

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 79 ఫిర్యాదులు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 79 ఫిర్యాదులొచ్చాయి. ఏఎస్పీ హుశేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

● ఎయిడెడ్ స్కూల్‌లో టీచర్, క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మాధవప్ప అనే వ్యక్తి రూ.14.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎల్.వెంకయ్యనగర్‌కు చెందిన కే.దొరస్వామి ఫిర్యాదు చేశారు.

● తన సంతకాలతో రూ.20లక్షలకు నకిలీ ప్రాంసరీ నోట్లు సృష్టించి కుట్రపూరితంగా మోసం చేస్తున్న నన్నూరులో పని చేస్తున్న ఆదినారాయణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాదుకు చెందిన జి.రామేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు.

● మా అమ్మ నాగమణి వారం రోజుల నుంచి కనపడటం లేదని ఆచూకీ తెలిపాలని, బుధవారపేటకు చెందిన ఒక ఆటో డ్రైవర్‌పై అనుమానం ఉందని ఆమె కుమారుడు, కుమార్తె ఫిర్యాదు చేశారు.

● చేతికొచ్చిన కంది, సజ్జ పంటలను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా తమ పంటను కోసుకుని వెళ్లారని, నష్ట పరిహారం ఇప్పించాలని గోనెగండ్ల మండలం, పెద్దనాటూరుకి చెందిన దస్తగిరి విన్నవించారు.

● తమకు ముగ్గురు కుమారులని, రెండో కుమారుడు టి.కుమార్ ఆస్తి గురించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కర్నూలు రాఘవేంద్ర నగర్‌కు చెందిన సుభద్రమ్మ వేడుకున్నారు.

మాస్ మీడియా ఆఫీసర్‌గా ప్రకాశ్ రాజు



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ రెగ్యులర్ జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్ (డెమో)గా ఎన్.ప్రకాశ్ రాజు పదోన్నతి పొందారు. 2024-25 ప్యానల్ సంవత్సరానికి మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో హెచ్‌ఈఈవోలుగా ఉన్న అధికారులకు డెమోలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. గుంటూరు పీవోడీటీటీలో హెచ్‌ఈఈవోగా పని చేస్తున్న ప్రకాశ్ రాజును కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసు డెమోగా పదోన్నతిపై నియమించింది. ఆనది ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామం. గతంలో 2017 నుంచి 2019 వరకు గత రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జి డెమోగా పని చేస్తున్న శ్రీనివాసులుశెట్టిని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (మగ) కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల జీజీహెచ్‌లో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా పని చేస్తున్న వై.ప్రసాద్‌రావును కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసర్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా కడప ఆర్‌డీ పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేశారు.


హరికిషన్‌కు సాహితీ పురస్కారం



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలల సాహిత్యవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన సాహితీ సంస్థ 'కళామిత్ర మండలి- తెలుగు లోగిలి' అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ రావు సోమవారం తెలిపారు. 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో తెలుగు సాహిత్యంలో సేవలు అందిస్తున్న వారిని సత్కరిస్తామన్నారు. నవంబరు 2న ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అందజేయనున్నా మన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని



నంద్యాల బస్టాండ్ సమీపంలో సోమవారం 40 సంవత్సరాలకు పైగా ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లైట్‌బ్లూ కలర్ షర్టు, సిమెంట్ కలర్ ప్యాంటు వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. సంబంధించిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ కోరారు.

ఫారెస్టు అధికారుల దాడి

రుద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్ పరిధిలోని పందిళ్లపల్లె గ్రామంలో వాసాల కలప ఉన్నట్లు సమాచారం అందడంతో రేంజర్ ముర్తుజావలి సిబ్బందితో కలిసి దాడి చేశారు. సోమవారం 30 వాసాల కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిని రుద్రవరం కలప డిపోకు తరలించారు. దాడుల్లో సెక్షన్ ఆఫీసరు మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు ఆనందతీర్థ శర్మ కన్నుమూత



- పలువురు ప్రముఖుల సంతాపం

ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేద వైద్యుడు ఆనందతీర్థ శర్మ(75) ఆదివారం రాత్రి కన్నుమూశారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన బెంగళూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. సోమవారం బెంగళూరులోనే ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ఈయన భార్య భారతి దేవి కూడా ఆరునెలల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆనందతీర్థ శర్మ మృతిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బాల్యం నుంచే హిందూ ధర్మరక్షణకు..

బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చురుగ్గా పాల్గొంటూ హిందూ ధర్మరక్షణకై తనవంతు కృషిచేశారు. బహుభాషా కోవిదుడిగా కీర్తిగడించిన ఆయన హిందూ భూమి నృత్యాష్టం పేరిట ఎనిమిది శ్లోకాలను రచించి భారతదేశ వర్ణనను చక్కగా విషదీకరించారు. మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ వీవీ గిరిలతో ప్రశంసలు అందుకున్నారు. ఆయుర్వే దంలో వైద్య విద్వాన్‌కోర్సు పూర్తిచేసిన ఆయన ఆయుర్వేదంలో వైద్యరత్నగా గుర్తింపు దక్కించుకున్నారు.

శివాజీ మహరాజ్ రాజవైద్యుడిగా..

పండిత ఆనందతీర్థ శర్మ పూర్వీకులు మరాఠ యోధుడు శివాజీ మహరాజ్ రాజ వైద్యులుగా పని చేసేవారు. కాలక్రమంలో ఆత్మకూరుకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఐదు తరాలకు పైగా ఇక్కడ ఆయుర్వేద వైద్యసేవలందిస్తూ సుపరిచితులయ్యారు. నేటికి వారి కుటుంబీకులు ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్నారు. వీరి ముత్తాత అప్పారావు పేరిట ఆత్మకూరులో అప్పారావువీధి కూడా ఏర్పాటు కావడం గమనార్హం.

బన్నీ ఉత్సవాల్లో మద్యం నియంత్రణకు చర్యలు



ఎక్సైజ్ కానిస్టేబుళ్లతో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు బన్నీ ఉత్సవాల నేపథ్యంలో నాటుసారా, కర్ణాటక మద్యం నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ లలితాదేవి ఆధ్వర్యంలో బన్నీ ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. మాళమల్లేశ్వరస్వామి బన్నీ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయని, భక్తులు ఎవరూ మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐలు నవీన్‌కుమార్, సిబ్బంది విజయ్, సోము పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి వెండి కలశం బహూకరణ



కలశాన్ని అందిస్తున్న దాతలు

రుద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామికి నంద్యాలకు చెందిన ఆచార్య దీక్షిత్ కమిటీ కార్యదర్శి నరసింహులుకు అరకేజీ కుంభహారతి వెండి కలశాన్ని బహూకరించారు. సోమవారం ఆలయానికి వచ్చిన దాతకు అర్చకులు గోపివర్మ, శివవర్మ ఘన స్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామి, లక్ష్మి గోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజలనంతరం వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

ముంచేశారు..!



రాంజల ఉప్పొంగడంతో చెరువును తలపిస్తున్న హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రోడ్డు

(5వ పేజీ తరువాయి)

ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన కర్తవ్యం అధికారులు, పాలకులపై ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యత రాహిత్యం, ప్రజల్లో కొరవడిన జవాబుదారీతనం, స్వార్థం వెరసి ఆక్రమణలు ఇష్టారాజ్యమై వాగులు, వంకలు సహజ స్వరూపాన్ని కోల్పోయాయి. వర్షాకాలం వచ్చిందంటే పరిసర కాలనీల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన దైన్యపరిస్థితి ఉంది. గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా సాగిన ఆక్రమణలు పుర ప్రజలకు శాపాలై వెంటాడుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలకు జలదిగ్బంధంలో ఆయా కాలనీలు చిక్కుకున్నాయి. వంకలు, వాగులు ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ పలుమార్లు

వాస్తవాలు ఇవీ..

- రాంజల చెరువు నిండితే కడగమ్ము పొంగిపొర్లిన వరద హౌసింగ్ బోర్డు, ఎన్జీవో కాలనీ మీదుగా కొడల్ పేటలో ఆవు దూడవంకలో కలుస్తుంది. రాంజల సమీపంలో కడగమ్ము వం కను ఓప్రముఖ కాలేజీ యాజమాన్యం తమ కాలేజీలో కలి పేసుకొని డ్రైనేజీగా మార్చేసి పైన బండలు వేశారు. వంకలపై ప్రహరి కట్టి వర్షపు నీరు వెళ్లడానికి రంధ్రాలు పెట్టారు. హౌసింగ్ బోర్డు, ఎన్జీవో కాలనీలో వంక ఆక్రమణల కారణంగా ఆనవాళ్లు కోల్పోయింది. ఎడతెరిపిలేని వర్షాలతో రాంజల చెరువు ఉప్పొంగి ఆయా కాలనీలను ముంచెత్తడానికి ప్రధాన కారణం ఆక్రమణలే అని స్థానికులు ఏకరువు పెడుతున్నారు.

హెచ్చరికలు జారీచేసినా పాలకులు, అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, నాయకులు ఆక్రమణలు తొలగించి సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

సర్వే చేయిస్తాం



పట్టణంలో ప్రవహించే వంకలు, వాగులు ఆక్రమణకు గురి కావడంతో కాలనీలు జలదిగ్బంధం అయ్యాయని ఫిర్యాదులొచ్చాయి. ఆక్రమణలపై సర్వే చేయిస్తున్నాం. రాంజల కడగమ్ము వంక, ఆవు దూడ, శాంతమల్లప్ప, మేక వంకలు సహజ స్వరూపం ఎంత..? ఏఏ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైందో తేల్చేందుకు సర్వేయర్‌ను నియమించమని తహసీల్దార్‌కు లేఖ రాశా. సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

- ఆవుదూడ వంక అంబేడ్కర్‌నగర్, కొడల్‌పేట, బార్‌పేట, కుమ్మరిగేరి, బోయగేరి, టీజీఎల్ కాలనీ, రాయనగర్ మీదుగా ప్రవహిస్తుంది. ఆక్రమణలకు గురై సహజ స్వరూపాన్ని కోల్పోవడంతో కొడల్‌పేట, బోయగేరి, రాయానగర్ కాలనీలో జలదిగ్బంధమై పేదలు తీవ్ర నష్టాన్ని మూటగట్టుకున్నారు.
- శాంత మల్లప్పకొండ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు దిగువన చెరువులో చేరి, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, తిరుమల నగర్ మీదుగా మండిగిరి పంచాయతీ రాజీవ్‌గాంధీ నగర్ దగ్గర్లో మేక వంకలో కలుస్తుంది. తిరుమలనగర్‌లో ఈ వంక ఆక్రమణలకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. చిన్నమా రెమ్మవ్వ దేవాలయం వద్ద ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వంక సహజ ప్రవాహ స్వరూపాన్నే మార్చేశారు. వంకను పూడ్చేసి ఎల్ ఆకారంలో చిన్నపాటి డ్రైనేజీగా మార్చేశారు. తాజా వర్షాలకు వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక తిరుమల నగర్, ప్రధాన రహదారులు జలదిగ్బంధం అయ్యాయి.
- నెట్టేకల్లు ప్రాంతంలో ప్రారంభమయ్యే మేక వంక అక్షరశ్రీ రెడిసిడెన్షియల్ స్కూల్, సులోచనమ్మ గార్డెన్, పద్మ శాలినగర్, ఆర్టీసీ బస్టాండ్ జైహింద్ ఏరియా, కపర్తినగర్, మహాత్మాగాంధీనగర్, డీఎస్పీ బంగ్లా ఏరియా, క్రాంతినగర్ మీదుగా ప్రవహిస్తుంది. గతంలో ఈమేక వంకకు వరదొచ్చి పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఈ వంక కూడా ఎక్కడికక్కడే ఆక్రమణలకు గురై సహజ స్వరూపాన్ని కోల్పోతుంది.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిరి

- కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కలిగే లబ్ధి గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కుటుంబానికి నెలకు దాదాపు రూ.1000 వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ, విద్య తదితర శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ర్యాలీలు, ప్రదర్శనలు, వ్యాసరచనలు, వక్తృత్వపు పోటీలు నిర్వహించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్

అన్న క్యాంటీన్, పారిశుధ్య నిర్వహణ అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారం తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్‌లో సానుకూల స్పందన వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్, డీపీవోలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, జీఎస్టీ పన్నుల తగ్గింపుపై విస్తృత అవగాహన కల్పించే అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్‌కు సంబంధించి కొన్ని అన్న క్యాంటీన్‌లలో శానిటేషన్ పనులు సరిగ్గా జరగడం లేదని, భోజనం నాణ్యతగా లేదని, సమయానికి అన్న క్యాంటీన్లు తెరవడం లేదనే నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి ఎట్టూ వ్యూలో ఒక అర్జీ కూడా ఉండకూడదని, వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు.

మొరాయించిన ఈనామ్ సర్వర్

- మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిచిన టెండర్లు
- ఆలస్యంగా తూకాలు



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లో సోమవారం ఈ నామ్ సర్వర్ మొరాయించింది. దసరా పండుగ కావడం, ఖరీఫ్ పంట దిగుబడులు చేతికందడంతో రైతులు పత్తి దిగుబడులను భారీగా తీసుకొచ్చారు. ఉదయం రైతులు తమ కమిషన్ ఏజెంట్ దుకాణం ముందు విక్రయానికి తెచ్చిన పత్తి, వేరుశనగ, ఆముదం దిగుబడులు టెండర్‌కు ఉంచారు వ్యాపారులు బిడ్డింగ్ దాఖలు చేసే సమయంలో సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ కోసం వేచి చూశారు. అధిక దిగుబడులు విక్రయానికి రావడం మరోవైపు మేఘాలు కమ్ముకొని ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. మార్కెట్ యార్డ్ అధికారులు విజయవాడ ఈనామ్ సాఫ్ట్‌వేర్ సిబ్బందితో చర్చించినా ఫలితం లేకపోవడంతో వెంటనే మ్యానువల్‌గా టెండర్ దాఖలు చేయాలని మైక్ ద్వారా అనౌన్స్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 6:30గంటల వరకు కొనసాగింది. టెండర్ ఆలస్యంతో రాత్రి తూకాలు కొనసాగాయి. రైతులకు ఇబ్బంది కలగకుండా మాన్యువల్ టెండర్‌తో తూకాలు జరిపామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవింద్ తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో పరిశీలకుడు కాకి ప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్ అధ్యక్షతన పోస్టర్‌ను విడుదల చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్‌సీ మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం ఆర్థిక బకాయిల చెల్లింపు అమలు చేస్తామని చెప్పిన కూటమి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రూ.30వేల కోట్ల బకాయిల చెల్లించాలని కోరినా ఇంతవరకు స్పందించలేదన్నారు. రవికుమార్, ఎస్.గోకారి, ఇస్మాయిల్, మధుసూదన్‌రెడ్డి, రోషన్న, హుశేన్, శేఖర్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



హుశేనాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కాటసాని

ఓర్వకల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామ సమీపంలో దెబ్బతిన్న పత్తి పొలాలు, వాగులను ఆయన పరిశీలించారు. ఎద్దుల బండ్లపై వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, టమోటా తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పూర్తిస్థాయి సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. ఎంపీపీ తిప్పన్న, నాయకులు వెంగన్న, నాగ తిరుపాలు,పాల మధుమోహన్, హరినాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాలతో ఆనందంగా గడపండి



పదవీ విరమణ పొందిన డీఎస్పీ, ఏఎస్ఐని సన్మానిస్తున్న ఎస్పీ

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- పదవీ విరమణ పొందిన డీఎస్పీ, ఏఎస్ఐ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ కుటుంబాలతో ఆనందంగా గడపాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఆర్ముడు రిజర్వుడు డీఎస్పీ కె.భాస్కర్‌రావును, వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శివరామిరెడ్డిని ఎస్పీ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేసిన పదవీ విరమణ పొందడం అభినందనీయ మన్నారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించా లన్నారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ హుశేన్‌పీరా, కర్నూలు డీఎస్పీ జే.బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, శివశంకర్, గుణశేఖర్‌బాబు, వేణుగోపాల్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అవయవదాన అంగీకారపత్రాన్ని ఎమ్మెల్యేకు ఇస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో స్త్రీ శక్తిని బలోపేతానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని, మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మహిళలను ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వస్థ్ నారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యంగా మహిళలు దీర్ఘకాలిక వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. స్వస్థ్ నారీ కార్యక్రమంలో భాగంగా రక్తదానం, అవయవదానంపై అవగాహన పెరగాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన ఒక్కరూ అవయవదానం చేస్తే 8 మందికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వినతి మేరకు ఎమ్మెల్యే అవయవదానం అంగీకారానికి ముందుకు వచ్చారు. అనంతరం జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో పాణ్యం ఎమ్మెల్యే పేరు నమోదు చేసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, కర్నూలు జీజీహెచ్ స్వస్థ్ నారీ నోడల్ ఆఫీసర్ డా.మాధవీ శ్యామల, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, డీఐవో డా.ఉమ, డీఎస్‌వో డా.నాగప్రసాద్ పాల్గొన్నారు.

ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆసియా కప్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై విజయం సాధించి పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ మరోసారి ప్రతీకారం తీర్చుకుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం ప్రకటన ద్వారా అభినందనలు తెలిపారు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ అద్భుత బ్యాటింగ్‌తో చారిత్రక విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

ఓబీసీలో చేర్చాలి



ఎంపీ నాగరాజును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వీర శైవులను ఓబీసీలో చేర్చాలనీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న కోరారు. సోమవారం సామాజిక వర్గ నాయకులతో కలిసి ఎంపీ నాగరాజుకు మొక్కను అందించి, సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో సమాజిక వర్గానికి న్యాయం చేసేందుకు అందరు సహకరించాలని కోరారు.

మాజీ ఎంపీటీసీ బోయ శివన్న మృతి

కర్నూలు రూరల్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్చాల గ్రామ మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు బోయ శివన్న(65) సోమవారం మృతి చెందారు. కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



నివాళి అర్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

శివన్న భార్య రాములమ్మ ఎంపీటీసీ సభ్యురా లిగా కొనసాగుతున్నారు వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమస్యలు పునరావృతం కాకూడదు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఆదేశించారు. సోమవారం డిప్యూటి కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కాగా ప్రజల నుంచి 26 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 23వ వార్డు శ్రీరామనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సరస్వతీదేవిగా అమ్మవారు

- కర్నూలులో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు
- చిన్న అమ్మవారిశాలలో అలరించిన చిన్నారుల ప్రదర్శన



చిన్న అమ్మవారిశాలలో బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శన



సత్యసాయి మందిరంలో అలంకరణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూలబజార్ చిన్న అమ్మవారిశాలలో సోమవారం ఉదయం పూజలు, సాయంత్రం మహా సరస్వతిదేవి అలంకరణ చేశారు. వన్‌టౌన్‌లోని హేమ నృత్య కళాశాలగురువు యామినీ ఆధ్వర్యంలో చిన్నారులు దుర్గామాత రూపకాన్ని కన్నుల పండువగా ప్రదర్శించారు. చిత్తారి వీధిలోని నిమిషాంబ ఆలయంలో అమ్మవారికి సరస్వతి దేవి అలంకరణ చేశారు. పాతనగరం గీతామందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవికి మహా సరస్వతి దేవి అలంకరణ చేశారు. నెహ్రూనగర్‌లోగల సత్యసాయి మందిరంలో ఛండీ హోమం, సాయంత్రం అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నగరంలో జమ్మిచెట్టు వీధిలోని లలితా పీఠంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



చిన్న అమ్మవారిశాలలో..

'గిరి బలిజ' పేరులో బలిజను తొలగించాలి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దొమ్మర సామాజికవర్గాలను 'గిరిబలిజ'గా మార్చిందని అందులో 'బలిజ' పదాన్ని తొలగించాలని సంఘం నాయకులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో డాక్టర్ సోమశేఖర్ సింగంశెట్టి, మండ్లెం రవికుమార్, తుమ్మలశెట్టి ఈశ్వరకుమార్, దాదిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మురళీమోహన్, శ్రీనివాసులు తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ స్పందిస్తూ అర్జీని సీఎం కార్యాలయానికి పంపాలని డీఆర్వోను ఆదేశించారు.

శ్మశానానికి ప్రహరీని నిర్మించాలి

కోడుమూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి విధులు విడుదల చేయాలని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మంత్రి ఎన్ఎండీ ఫారూక్‌ను కోరారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మంత్రిని కలిశారు. ప్రహరీ లేక ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన మంత్రి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు విడుదల చేయిస్తానని హామి నిచ్చారు. దావూద్, ఇంతియాజ్, నిహార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిప్రతం ఇస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, ముస్లింలు

గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి : డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ సూచించారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా సోమవారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి కిసాన్ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించి, ఉచిత కార్డియాక్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, టీవీల ముందు కూర్చుని కాలక్షేపం చేయడంతో వ్యాధులు వస్తున్నాయన్నారు. వ్యాయామం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. కిమ్స్ సీఈవో డా.సునీల్ సేపూరి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో రూ.4వేల విలువైన గుండెపరీక్షలను రూ.650లకే చేస్తున్నామన్నారు. డా.తోటనాగేంద్ర ప్రసాద్, డా.సందీప్ కుమార్, డా.అరుణ, డా.ఫారూక్ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కల్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు మంగళవారం (దుర్గాష్టమి)సెలవురోజు కూడా బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని బిల్లుల చెల్లింపు కేంద్రాలు తెరచి ఉంటాయన్నారు.

బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎరుకుల కుశలన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ సిరికి వినతి పత్రాన్ని అందజేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ఎస్సీ ఎస్టీలను నియమించాలని, తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పించాలని కోరారు.

ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ గుర్రం జాషువ ఎక్సలెన్సీ అవార్డు -2025ను అందుకున్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేసినందుకు నవ్యాంధ్ర విద్యార్థి సమాఖ్య, ద్రవిడనాడు సంక్షేమ సంఘం ప్రదానం చేసింది.

యువతలో పెరుగుతున్న గుండె వ్యాధులు



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎస్పీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువతలో ఇటీవల గుండెజబ్బులు పెరుగుతున్నాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గుండె చెకప్ ప్యాకేజీని ఎస్పీ ఆవిష్కరించారు. 50 ఏళ్ల పైబడిన వారిలో వచ్చే హృద్రోగ సమస్యలు ఇప్పుడు చిన్న వయసులో వస్తున్నాయన్నారు. హాస్పిటల్ హెడ్ డా.వై.మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీతో గుండె పరీక్షలు తక్కువ ఖర్చుతో చేస్తామన్నారు.

వైస్ చాన్సలర్‌కు సన్మానం



వీసీని సన్మానిస్తున్న దంత వైద్యులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.చంద్రశేఖర్‌ను ఐడీఏ రాయలసీమ బ్రాంచ్ వైద్యులు సన్మానించారు. సోమవారం ప్రైమ్ హోటల్‌లో అధ్యక్షుడు డా.కె.కిషోర్ కుమార్ కార్యదర్శి డా.ఆర్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నుంచి తొలిసారిగా వీసీ పదవిని డా.పి.చంద్రశేఖర్ పొందారన్నారు. జీజీహెచ్‌లో గుండె జబ్బుల ప్రత్యేక ఐసీయూ, కేథ్‌ల్యాబ్ ఏర్పాటు, డీఎం సీటు తెప్పించారని అభినందించారు. ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.వై.మురళీధర్ రెడ్డి, దంత వైద్యులు డా.ఉపేంద్రనాథ్‌రెడ్డి, డా.నౌషద్, పరమేశ్వరరెడ్డి, డా.నాగలక్ష్మిరెడ్డి, డా.మంజునాథ్, డా.నరేష్ పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు

- పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి



పెద్దటేకూరులో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో పారదర్శకత కోసమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దటేకూరు గ్రామంలో తసీల్దారు కే.ఆంజనేయులు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. సమస్యలు తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబరు-1967ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ వేణుగోపాల్, ఎంపీడీవో నాగశేషాచలరెడ్డి, అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ దేవులంకాటి శేఖర్, ఎంపీటీసీ మునిస్వామి, సర్పంచ్‌లు పద్మావతమ్మ, సహారాబీ పాల్గొన్నారు.

● నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డా.ఏ.సిరిని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సోమవారం కలిశారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు బోకే అందించి, పాణ్యం అభివృద్ధిపై చర్చించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ వైద్యులు

గోల్డెన్ అవర్ కీలకం

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుండెనొప్పికి గురైన తర్వాత తొలి గంట (గోల్డెన్ హవర్) కీలకమని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఎండీ ఎస్‌వీ చంద్రశేఖర్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కొత్తబస్టాండు వద్ద ర్యాలీని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఛాతిలో నొప్పి, ఎడమవైపు భుజం లాగడం, గుండెదడ, అకస్మిక ఆయాసం కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్డియాలజిస్టు డా.రాఘవేంద్ర వైద్యులు జనరల్ మేనేజర్ యు.నదీమ్, రమణబాబు పాల్గొన్నారు.



ఇదేం రహదారి?

నగర పాలక పరిధిలోని 34వ వార్డు శివప్పనగర్ వాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, కాలువలు లేకపోవడంతో చిన్న వర్షం కురిసినా రోడ్డు చెరువులా మారుతోందని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. పలుమార్లు నగర పాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - కర్నూలు న్యూసిటీ

దీపాలు ఎక్కడ?

నగరంలోని రేడియో స్టేషన్ వద్ద కోడుమూరు రహదారిలో వీధిలైట్లు లేవు. పెద్దపాడు గ్రామం వరకు నూతన రహదారి నిర్మించి, డివైడర్ ఏర్పాటు చేసిన అధికారులు వీధి దీపాలు అమర్చడం మరిచారు. ఈమార్గంలోనే కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, బళ్లారి ప్రాంతాకు వాహనాలు వెళుతుంటాయి. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. - కర్నూలు కలెక్టరేట్



ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

ఓర్వకల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. మండలంలో పత్తి, ఉల్లి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు నాయుడు, ముర్తుజావలి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

హుశేనాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి

ఓర్వకల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో అమ్మవారి విగ్రహానికి టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పూజలు చేశారు. నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నాగముని, కాటినేని నారాయణ, గొల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి 'రవీంద్ర' భాగస్వామ్యం



కమిషనర్‌తో రవీంద్ర విద్యాసంస్థల యాజమాన్యం

కర్నూలు న్యూసిటీ/ఎడ్యుకేషన్ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర అభివృద్ధికి భాగస్వామ్యులయ్యేందుకు రవీంద్ర విద్యాసంస్థల యాజమాన్యం ముందుకు వచ్చింది. సోమవారం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య, చైర్మన్ జీవీఎం.మోహన్‌కుమార్, సీఈవో జి.గోపినాథ్, వైస్ చైర్మన్ జి.వంశీధర్ నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసారు. మంత్రి టీజీ భరత్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా సహకరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కర్నూలును విశాఖ లాంటి మహానగరాల సరసన నిలిపేందుకు పెట్టుబడిదారులు తరావాలని పిలుపునిచ్చారు.

ఆధ్యాత్మికతను అలవరచుకోవాలి

- సీఎస్ఐ బిషప్ రైట్ రెవ. సంతోష్ ప్రసన్నరావు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బిషప్ రెవ.సంతోష్ ప్రసన్నరావు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్యంలోనే ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సీఎస్ఐ నంద్యాల డయాసిస్ బిషప్ రైట్ రెవ. సంతోష్ ప్రసన్నరావు ఉద్బోధించారు. నగరంలోని కోల్స్ జూనియర్ కళాశాలలో సోమవారం 'చైల్డ్ ఇవంజలిజం ఫెలోషిప్ ఆఫ్ ఇండియా' కర్నూలు శాఖ ఏర్పాటు చేసిన 'గుడ్‌న్యూస్' ప్రారంభించారు. బిషప్ సతీమణి బ్యూలా, ఎస్‌టీబీసీ కళాశాల కరస్పాండెంట్ ఆర్ఆర్‌డీ సజీవరావు, సీఈఎఫ్ డైరెక్టర్ ప్రభుదాస్ పాల్గొన్నారు. సీసీ చర్చి ప్రతినిధులు అనిల్ నాథ్, విజయకుమార్, జోసెఫ్ రావు, సుధీర్‌బాబు, నెహెమ్యా స్టెల్లా, కిరణ్‌పాల్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సి. బెళగల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం వీఆర్వోలతో కలసి టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. పోలకల్, గొల్లలదొడ్డి, సిబెళగల్, ఖుబందహల్, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డి, తిమ్మనదొడ్డి కొత్తకోట గ్రామాల్లో 2541 కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగిల్ విండో ప్రెసిడెంట్ డాక్టర్ తిమ్మప్ప, అమర్, డీలర్లు నాగమద్దిలేటి, ఉపేంద్ర, గోకారి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా నాయకులు నరసప్ప, నెట్టప్ప అన్నారు. సోమవారం టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి సూచనల మేరకు ఆలూరు పట్టణంలో 31వ వార్డు పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ రంగయ్య, నాయకులు ముద్దురంగ, మసాల జగన్, గూళ్యం రామాంజినేయులు, జిలానీ, మద్దిలేటి, సోడాల వెంకటరాముడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవనకొండ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. మండలంలోని కప్పట్రాళ్లలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామస్థులకు పంపిణీ చేశారు. కప్పట్రాళ్ల మల్లికార్జున, రవికుమార్, పుల్లయ్య, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిరసనలతో దద్దరిల్లిన కౌన్సిల్


చైర్ పర్సన్ పోడియం ఎదుట బైఠాయించిన కౌన్సిలర్లు

ఆదోని టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంత్రం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అధికారులు, కౌన్సిలర్ల మధ్య ఆరోపణలు, వాదోపవాదాలు, నిరసనల మధ్య కొనసాగింది. తన వార్డులో అభివృద్ధి పనులు జరగనందుకు కౌన్సిలర్ హసీనా భాను చైర్ పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. ఆమెకు మద్దతుగా కౌన్సిలర్లు ఫయాజ్, సైదాన్ బీ, వాసిం, ఉస్మాన్ కూడా కింద కూర్చొని నిరసన తెలిపారు. కౌన్సిలర్ ఫయాజ్, రఘు మాట్లాడుతూ అధికారులు మంజూరైన పనులను చేయించడంలో విఫలం అయ్యారని ఆరోపించారు. కమిషనర్ కృష్ణ ఎంఈ సత్యనారాయణ, హెల్త్ ఆఫీసర్ డా సందీప్ కుమార్, డీఈలు రాజశేఖర్ రెడ్డి, గోపీనాథ్, రామమూర్తి పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ


స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఆస్పరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిరుపేద కుటుంబాలకు స్మార్ట్ రేషన్‌కార్డులు సోమవారం పంపిణీ చేశారు. మండల క్లస్టర్ వెంకటేష్‌చౌదరి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.. మహిళలకు 313233 రేషన్‌కార్డులు రేషన్ దుకాణాల వద్ద పంపిణీ చేశారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్, వీఆర్వో హరికృష్ణనాయక్, నౌనేపాటి, పూరిమెట్ల నౌనేపాటి, డీలర్ సంజీవరాయుడు, డీలర్ నారాయణస్వామి, మల్లేపల్లి రామకృష్ణ, దూదేకుల ఇషా, పురిమెట్ల నాగరాజు, కురువ రంగస్వామి, సంజీవ, హనుమన్న, అంజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయదశమి రోజున జరగనున్న దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అరికేర గ్రామంలో దేవరగట్టు ఉత్సవాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఉత్సవాల్లో హింసకు తావు లేకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఉత్సవాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

4న మార్కెట్ యార్డ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అక్టోబర్ 4వ తేదీన మార్కెట్ యార్డ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని చైర్మన్ జిందే శారద శంకర్ తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందుకు ఆహ్వాన పత్రికలను వారి కుటుంబ సభ్యులు అందజేశారు. పాలకవర్గం గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, చైర్మన్ శారద శంకర్, వైస్ చైర్మన్ ఆదూరి విజయకృష్ణ తోపాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, తెదేపా, బీజేపీ, జనసేన నాయకులు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారన్నారు. మీనాక్షి నాయుడు స్వగృహం నుంచి భారీగా ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

'డైలీ వేజెస్ కార్మికులనే ఆప్కాస్‌లో చేర్చాలి'

ఆదోని టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా డైలీ వేజెస్ ప్రకారం పని చేసే కార్మికులనే ఆప్కాస్‌లో తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, భీమేష్, వెంకన్న, కార్మిక సంఘం నాయకులు జాన్‌బాబు, ఉరుకుంద, ఎల్లప్ప, ఈరన్న మోహన్ పాల్గొన్నారు.

అపరిచితులు సంచరిస్తే చర్యలు తప్పవు

తుగ్గలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):. వజ్రాల అన్వేషణకు వస్తున్నామనీ ఎవరైనా అపరిచితులు గ్రామాల్లో కానీ, పొలాల్లో కానీ సంచరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల పరిధిలోని పొలాల్లో వజ్రాన్వేషణ కోసం వచ్చిన వారు పొలాల్లో ఉంటే వారి సొంత ఊర్లకు తిరిగి వెళ్లాలని ఆదేశించారు. వజ్రాల అన్వేషణ ముసుగులో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందనీ, దీని వల్ల యువత చెడిపోతారని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు బస్టాండుల్లో గానీ, పొలాల్లోగానీ ఉంటే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి హోటళ్ల యజమానులు ఆశ్రయమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి


దివ్యాంగుడి సమస్య వింటున్న సబ్ కలెక్టర్

ఆదోని, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలనాధికారి వసుంధర, సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ పద్మనాభరెడ్డి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, రమాదేవి పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

మద్దికెర సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎడవలి గ్రామంలో అక్టోబరు 3వ తేదీ నుంచి నాల్గో విడత భూముల రీసర్వే జరగుతుందని రైతులు సహకరించాలని డిప్యూటీ తహీల్దార్ యువరాజు, ఆర్ఐ రామదాసు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్లు గాదె లింగప్ప, రిలేజ్ సర్వేయర్లు రోజారాణి, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

ఆరోగ్యంతోనే కుటుంబం పదిలం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంను సంరక్షించుకుంటే కుటుంబం పదిలంగా ఉంటుందని మాతా శిశు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం స్వస్థ నారీ సశక్తి పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణంలో మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ వికసిత్ భారత్‌లో మోడీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందన్నారు. నాయకులు మహబూబ్ బాషా మహాదేవ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తుగ్గలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మాజీ ఎంపీపీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, టీడీపీ నాయకులు బాలన్న, మిద్దె రవికుమార్, సర్పంచ్ ఓబులేసు, లక్ష్మణ స్వామి అన్నారు. సోమవారం తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి, జి.ఎర్రగుడి, పెండేకల్ ఆర్ఎస్ గ్రామాల్లో స్మార్ట్ కార్డులు అందించడంతో పాటు జీఎస్టీ తగ్గించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీఎస్టీతో ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సంగాల కృష్ణ, సోము, శేఖర్, జయరాం, మల్లి, అంజి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారు కొండ శ్రీనివాసులు అన్నారు. మొలగవల్లి లబ్ధిదారులకు ఆయన చేతులమీదుగా అందజేశారు. హనుమప్ప, బెవిన ఈరన్న, సోమశేఖర్, నరసింహులు, అఖిల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా అమ్మవారు

అమ్మవారు సోమవారం వివిధ రూపాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్రులలో మూలా నక్షత్రానికి అధిక ప్రాధాన్యం ఉంది. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.


ఆలూరులో సరస్వతీదేవి అలంకరణలో


మద్దికెరలో సరస్వతీదేవిగా..


పత్తికొండలో..


ఆదోనిలో..


ఆదోని సమితి ప్రాంగణంలో మహాగౌరిగా..


ఆహార ధాన్యాలతో అమ్మవారి దర్శనం

'పొదుపు గ్రూపులను ఎలా మారుస్తారు?'

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనేక ఏళ్లుగా ఒకే గ్రామైక్య సంఘంలో ఉంటున్న మా పొదుపు గ్రూపులను తమ అనుమతులు లేకుండా వేరే గ్రామైక్య సంఘంలోకి ఎలా మారుస్తారంటూ పొదుపు మహిళలు ఇందిరా క్రాంతి పథకం అధికారులను సోమవారం ప్రశ్నించారు. పత్తికొండ పట్టణంలోని 14 గ్రామైక్య సంఘాలు ఉండగా, సుమారు 500 పైచిలుకు పొదుపు మహిళల గ్రూపులు ఉన్నాయి. అయితే చార్మినార్ గ్రామైక్య సంఘం కింద సూరజ్, సాయిరాం, ఫిరా తదితర పొదుపు సంఘాలు ఉన్నాయి. అయితే ఈ గ్రామైక్య సంఘంలో ఉన్న గ్రూపులను పొదుపు సంఘాల సభ్యులకు తెలియకుండా అధికారులు వేరే గ్రామైక్య సంఘంలోకి ఎలా మారుస్తారంటూ సోమవారం ఇందిరా క్రాంతి పథకం ఏపీఎంను కలిసి వినతి పత్రం అందించారు. పొదుపు గ్రూపు మహిళలు మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల తీర్మానం లేకుండా వేరే గ్రామైక్య సంఘంలోకి మార్చవొద్దన్నారు. రజియా, లక్ష్మీదేవి, షేక్‌నబి, అనిత, నూర్జహాన్ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి : సీపీఐ



నందవరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందవరం, సెప్టెంబరు 29 ఆంధ్రజ్యోతి): నందవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మండల అధ్యక్షుడు గిడ్డయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రామలింగడు, అంజనప్ప, దేవరాజు, బసవరాజు, మిన్నల్లా పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు మేలు



సూగూరులో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మేలు చేసేందుకే స్మార్ట్ రేషన్ కార్డులని బండేగురుస్వామి అన్నారు. సోమవారం పూలచింత గ్రామంలో కార్డులను పంపిణీ చేశారు. నదికైరవాడి గ్రామంలో నియోజకవర్గ ఐటీడీపీ నాయకులు వీరేష్, పెద్దకొత్తిలిలో ఆదిశేషు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కౌతాళం: ప్రభుత్వం రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టి సజావుగా ప్రభుత్వం అందిస్తున్న సరుకులు నేరుగా లబ్దిదారులకు అందేలా నూతనంగా క్యూఆర్ కార్డులతో రేషన్ స్మార్ట్ కార్డులను అందజేస్తున్నదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. ఎ కౌతాళంలో సోమవారం ఆయా వార్డులలో టీడీపీ నాయకులతో కలిసి నూతన కార్డుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమాలలో కౌతాళం టీడీపీ నాయకులు కాశీవిశ్వనాథ, కార్యకర్తలు సిద్దు, రహిమాన్, రాజబాబు, డీలర్‌లు జిన్నా వలి, రాజబాబు, మంజునాథ, పంపాపతి ఉన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ కార్డులను రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేశారు. సోమవారం సూగూరు గ్రామంలో ఎల్లెల్సీ కాలువ చైర్మన్ నరసింహులు, ఎస్వీ బాస్కర్ రెడ్డి, ఖాజా, ఈరన్నలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, తాయన్న, గ్రామ కార్యదర్శి స్వామినాథన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు వైసీపీ అండగా ఉంటుంది



గోనెగండ్లలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, అధైర్యపడకండి అని రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కేఆర్ అక్మీకాంతరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షరెడ్డి, రామకోటిరెడ్డి, జెడ్పీటీసీ చక్రవర్తి అన్నారు. నందవరంలో సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేశారు. 15 నెలలుగా వైసీపీ నాయకులపై చేస్తున్న దాడులు,అక్రమ కేసుల ద్వారా దౌర్జన్యలకు పాల్పడడం లాంటి వాటిపై డిజిటల్ బుక్ ద్వారా ప్రజలకు చేరవేయడం, కార్యకర్తలకు ధైర్యం నింపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకోటిరెడ్డి, మీసాల సంపత్‌గౌడు, రమేషప్పగౌడు పాల్గొన్నారు.

గోనెగండ్ల: వైసీపీ పార్టీ కష్టాలలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ, మండల వైసీపీ కన్వీనర్ కృష్ణారెడ్డి, వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధానకార్యదర్శి ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం గోనెగండలోని వైసీపీ కార్యాలయం నందు అన్యాయాలకు గురువుతున్న పార్టీ కార్యకర్తల కోసం డిజిటల్ క్యూఆర్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మన్సూర్, జిల్లా వైసీపీ యూత్ కార్యదర్శి ఇమ్రాన్, దొరబాబు, అగ్రహారం నాగిరెడ్డి, చికెన్‌రాజా, గంగాధర్, గోవిందు, దేవేంద్ర, మత్స్యావల్లబుడు, పుట్టపాశం నాగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి జబ్బార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి స్థానిక సోమప్ప సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దిలేటినాయుడు, శ్రీరాముడు, మాలిక్, బీజీ విరుపాక్షి, విజయేంద్ర, ఖాజీ, శివ, మల్లికార్జునగౌడ్, నరసింహులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి, మిరప, ఉల్లి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు పరమేష్, తిక్కన్నలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ గీతాప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున పంటనష్ట పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్లను బాగు చేయండి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జలమయమైన రోడ్లపై వరినాటువేసి వినూత్నంగా నిరసన చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ నాయకులు రమేష్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్లన్నీ దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో రవి, రాజు, అబ్దుల్లా, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ నో ఇంట్రెస్ట్..!

పురపాలక సంఘాల పరిధిలో ఉన్న అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం జూలై 27వ తేదీన ప్రకటించింది. అనధికార లేఅవుట్లు వేసిన రియల్ వ్యాపారులు ముందుకు వచ్చి ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంది. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో మాత్రం రియల్ వ్యాపారులు ఎల్ఆర్ఎస్ స్కీంను ఏమాత్రం పట్టించుకోకపోగా తాము విక్రయించిన స్థలాల వివరాలు, కొనుగోలుదారుల వివరాలు సైతం వెల్లడించటం లేదు.

- ముందుకురాని రియల్ వ్యాపారులు
- గుట్టుగా క్రయవిక్రయాలు
- మున్సిపల్ ఆదాయానికి గండి



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ స్కీంపై రియల్ వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఎమ్మిగనూరు పరిధిలో గతంలో దాదాపు 98వెంచర్లు ఉండగా ఇందులో అప్పటికే 60 వెంచర్లు ఎల్ఆర్ఎస్ చేసుకున్నారు. మిగిలిన 38 వెంచర్లలో 20 వెంచర్లుకు సంబంధించి ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు ముందుకొచ్చారు. మిగిలిన వెంచర్లుకు సంబంధించి వ్యాపారులు ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు ఏమాత్రం స్పందించటం లేదు.

500కు పైగా దరఖాస్తులు రావాల్సి ఉండగా..

ఈ వెంచర్ల నుంచి దాదాపు 500కు పైగా దరఖాస్తులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 110 మాత్రమే వచ్చాయి. దాదాపు రూ.70లక్షల మేర ఆదాయం సమకూరింది. ఇంకా దాదాపు 400 వరకు దరఖాస్తులు రావాల్సి ఉంది. ఇవన్నీ వస్తే మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరనుంది. రియల్ వ్యాపారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నాన్ లేఅవుట్ వెంచర్లు పూర్తిస్థాయిలో ఎల్ఆర్ఎస్ చేయిస్తే మున్సిపాలిటీకి దాదాపు రూ.2కోట్లుకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అవగాహన కల్పించినా..

ఎల్ఆర్ఎస్ స్కీంను ప్రభుత్వం ప్రకటించిన వెంటనే మున్సిపల్ అధికారులు రెండు సార్లు రియల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. అయినప్పటికీ రియల్ వ్యాపారుల్లో కొంతమంది మాత్రమే స్పందించారు. మిగతావారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మున్సిపల్ అధికారులు కోరినప్పటికీ..

ఎల్ఆర్ఎస్ వచ్చిన వెంటనే మున్సిపల్ అధికారులు రియల్ వ్యాపారులను తమ వెంచర్లకు సంబంధించిన వివరాలు, స్థలాలు కొనుగోలు చేసిన వారి వివరాలు ఇవ్వాలని కోరినప్పటికీ, కొనుగోలుదారులు తమకు ఎల్ఆర్ఎస్ చేయించాలని అడుగుతారనే నెపంతో వ్యాపారులు ఏమాత్రం స్పందించటం లేదు. వివరాలు లేక టౌన్ ప్లానింగ్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంచర్లలో స్థలాలు విక్రయించగా మిగిలిన స్థలాలకు వ్యాపారులే ఎల్ఆర్ఎస్ చేయించుకోవాల్సి ఉండగా ఏమాత్రం పట్టించుకోక పోగా గుట్టుచప్పుడు కాకుండా ఆ స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇష్టానుసారంగా వెంచర్లు..

పట్టణంలోని మైనార్టీ కాలనీ, ఐకొండ, స్పిన్నింగ్ మిల్లు, ఆదోని రోడ్డు, ముగతి పేట, కలుగొట్ల, గుడికల్, గోనెగండ్ల, ఆదోని బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు అనధికారిక వెంచర్లు వేశారు. వెంచర్లు వేసేముందు ఎల్ఆర్ఎస్, ఎన్‌ఏతో పాటు లేఅవుట్ అప్రువల్ చేయించాల్సి ఉంది. అయితే వ్యాపారులు ఇవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వెంచర్లు వేసి స్థలాలను విక్రయించి సొమ్ముచేసుకున్నారు. కొనుగోలు దారులు అప్రూవల్ అనుమతులు లేక బ్యాంకు రుణాలు అందక చాలా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు.



పట్టణ శివారు ఆదోని రోడ్డులో ఉన్న రియల్ వ్యాపారులు వేసిన వెంచర్

రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తాం

కొంతమంది రియల్ వ్యాపారులు, ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్ చేయించుకోవటంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ చేయించుకోక పోతే నోటీసులు జారీ చేసి రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తాం.

● రాజేశ్, టీపీవో, ఎమ్మిగనూరు

ప్రతి ఇంటికి తాగునీరు అందజేస్తా: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీటిని అందజేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సిక్స్, సూపర్‌హిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, ప్రజలకు చేస్తున్న మేలుతో పాటు అభివృద్ధి పనులను తెలియజేశారు. గ్రామంలో చాలామంది ప్రజలు తమకు తీవ్ర తాగునీటి సమస్య ఉందని, తాగేందుకు గుక్కెడు నీరు కూడా దొరకడం లేదని, గ్రామంలో ఉన్న నీటిప్లాంట్‌ను మూయించడంతో తాగునీటి సమస్యను ఏర్పడిందని మహిళలు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మూడు రోజులలోపు మీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో పేరుకుపోయిన పారిశుధ్యంపై స్థానిక ఎంపీడీవో అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. గ్రామాభివృద్ధి నిధులు వస్తున్నా ఎందుకు అభివృద్ధి చేయడంలేదని ప్రశ్నించారు. వెంటనే గ్రామంలలో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పత్తి రైతులతో మాట్లాడి పత్తికి గిట్టుబాటు ధర కల్పించేలా చూస్తామన్నారు. కార్డులో స్మార్ట్‌కార్డులు మంజూరైన ప్రతి ఒక్కరికి స్మార్ట్‌కార్డులను అందజేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వైసీపీ నాయకుల అవినీతితో గ్రామంలో కనీసం ప్రజలకు తాగునీరు కూడా లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం రైతుల కోసం మాట్లాడుతున్న వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు, గ్రామాధ్యక్షుడు వీరేష్, ఉరుకుంద, నరసప్ప, బోడబండ సురేష్‌చౌదరి, నరసన్నగౌడ్, డీలర్ ఈరన్న, కందనాతి సర్పంచ్ కేశన్న, చెన్నాపురం నాగరాజు, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో బంగారమ్మ, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్, ఏపీఎం జయశ్రీలతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

● టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. కౌన్సిల్ లీగల్ అడ్వైజర్ నియామకం తీర్మానంపై వైసీపీ, టీడీపీ, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని టీడీపీ, బీజేపీ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అజెండాలో ప్రవేశపెట్టిన 18అంశాలతో పాటు టెబుల్ అజెండాగా మున్సిపల్ లీగల్ అడ్వైజర్ గురు రాజరావును నియమించే తీర్మానాన్ని ఆమోదించాలని వైస్‌చైర్మన్ నజీర్ అహ్మద్ చైర్మన్‌ను కోరారు. వైసీపీ సభ్యులు మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని చైర్మన్‌కు అందజేశారు. ఇందుకు టీడీపీ, బీజేపీ సభ్యులు రాందాస్ గౌడ్, స్వాతి, వహీద్, ఇసాక్, అమాన్, మహిళా సభ్యులు, బీజేపీ సభ్యుడు దయాసాగర్ వ్యతిరేకించారు. కౌన్సిల్‌లో మెజార్టీ సభ్యుల్లేకుండా ఎలా ఆమోదిస్తారని చైర్మన్‌ను నిలదీశారు. దీంతో వైసీపీ, టీడీపీ, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని కొద్దిసేపు తీవ్ర గందరగోళం ఏర్పడింది. పూర్తిస్థాయిలో సభ్యులు ఉన్న సమయంలో లీగల్ అడ్వైజర్‌ను నియమించుకోవాలని టీడీపీ, బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. తమకు కౌన్సిల్‌లో మెజార్టీ ఉందని మున్సిపల్ చట్టం 84ప్రకారం నియమించుకోవచ్చని, టేబుల్ అజెండాగా ఆమెదిస్తున్నామని వైస్‌చైర్మన్ నజీర్ చెప్పుకొచ్చారు. టీడీపీ, బీజేపీ సభ్యులు నిరసిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. మున్సిపల్ లీగల్ అడ్వజర్లుగా గురు రాజరావు, నర్సారెడ్డి, గురుప్రసాద్ ముగ్గురు నామి నేషన్లు వేశారని, ఇందులో వైసీపీ సభ్యుల మెజార్టీ ఉండటంతో ఎంకే గురురాజరావు నియమకాన్ని ఆమోదించామని చైర్మన్ రఘు తెలిపారు. వాకౌట్ చేసిన టీడీపీ, బీజేపీ సభ్యులు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ రఘు, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామదాసుగౌడ్, కౌన్సిలర్ స్వాతి, వైస్‌చైర్మన్ నజీర్‌అహ్మద్ పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్-2 దివ్యకళ, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ లీగల్ అడ్వైజర్ నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న టీడీపీ, బీజేపీ సభ్యులు

కొత్త రుణాలు ఎందుకు ఇవ్వరు..?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రుణాలు సక్రమంగా చెల్లిస్తున్నా.. కొత్తగా రుణాలు ఎక్కువ చేసి ఎందుకివ్వటం లేదని బ్యాంకు సభ్యులు, సీపీఐఎంఎల్, సీపీఐ నాయకులు చిన్ని ప్రసాద్, భాస్కర్ యాదవ్‌తో పాటు పలువురు సభ్యులు టౌన్ బ్యాంకు పాలకవర్గాన్ని నిలదీశారు. సోమవారం స్థానిక కుర్ని కమ్యూనిటి హాల్‌లో ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సార్వజన సభ సమావేశం బ్యాంకు అధ్యక్షుడు ఉరుకుందయ్య శెట్టి అధ్యక్షతన జరిగింది. సభ్యులు, ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ రూ లక్ష అప్పు తీసుకొని సక్రమంగా చెల్లించిన వారికి గతంలో ఇచ్చిన రుణం కన్న ఎక్కువ చేసి ఇవ్వాలని అడిగితే చైర్మన్ అభ్యంతరాలు చెబుతున్నారని చిన్నిప్రసాద్ పాలకవర్గాన్ని నిలదీశారు. ఇందుకు వైస్ చైర్మన్ నరసప్ప మాట్లాడుతూ రుణ గ్రస్తుడి ఆర్థిక స్థోమతను అంచనా వేసి చైర్మన్ రుణం మంజూరు చేస్తారన్నారు. 30ఏళ్లనుంచి బ్యాంకు ఎన్నికలు నిర్వహించలేదని, నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి మాట్లాడుతూ రూ.లక్ష తీసుకున్న వారు సక్రమంగా చెల్లించకపోగా కొత్తగా రెట్టింపు చేసి ఇవ్వమని అడుగుతున్నారని, ఇచ్చిన రుణమే సక్రమంగా చెల్లించకుంటే రెట్టింపు రుణం ఎలా చెల్లిస్తారన్నారు. అందుకే గతంలో ఇచ్చిన రుణాన్నే ఇస్తున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వెంకటేశ్వర రెడ్డి, నవీన్‌కుమార్, శాలేమ్, వెంకట గిరి, మహబూబ్, సీఈఓ, బ్యాంకు సిబ్బంది, సభ్యులు, షేర్ హోల్డర్లు మచాని శివకుమార్, శేక్షావలి, రాజు, మాచాని మహేష్, కమ్మ మహేంద్ర బాబు, బుగిడే నాగరాజు, సత్యనారాయణ, వాహబ్‌లు పాల్గొన్నారు.



రుణాలు ఇచ్చే విషయంలో ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నిస్తున్న సభ్యుడు చిన్ని ప్రసాద్

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు మాల నరసన్న, బతకన్న, సత్యన్న, స్వామిదాసు, గోట్ల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా కేంద్రంగా ఉండడంతో ఎమ్మిగనూరు, ఆదోని, కౌతాళం, మంత్రాలయం, నందవరం, గోనెగండ్ల మండలాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా కేంద్రమైన కర్నూలుకు వెళ్లాలంటే దాదాపు మూడు గంటల సమయం పడుతుందన్నారు. జిల్లాస్థాయి అధికారులకు సమస్యలను తెలుపుకునేందుకు రైతులు, ప్రజలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల వల్ల నష్టపోయిన చేనేత కుటుంబాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మికుల సంఘం తాలుకా కార్యదర్శి కాలప్ప, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని 4,5,6 వార్డులలో ఏపీ చేనేత సంఘం ఆధ్వర్యంలో చేనేత కుటుంబాలను పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు నల్లరేగడిలో ఉన్న శివన్ననగర్ ప్రాంతంలో దాదాపు 450 కుటుంబాలకు చేనేతనే జీవనాధారం. చేనేతల మగ్గంలోకి నిలిచిన వర్షపు నీరును తోలగించడానికి మోటర్లు పెట్టి బయటకు పంపాల్సిన అవసరం వచ్చిందన్నారు. పట్టు చీరలు, జెర్రి, నూలు దారం దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మన్న, కేశన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



తలారి హుస్సేన్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి

కోసిగి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డి.బెళగల్ గ్రామంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి అన్నారు. డి.బెళగల్ గ్రామానికి చెందిన తలారి హుస్సేన్‌ను టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంతో ఆయనకు పూలమాలలు శాలువాలతో సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండేశ్, బసవ, తిరుమలేశ్, సీతారాం, గొల్ల నాగరాజు, రంగారెడ్డి, గౌడు, మంగళి చిన్న వీరేష్ పాల్గొన్నారు.

పునర్విభజనపై ప్రజలు సలహాలివ్వాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటి పరిధిలో 35 వార్డుల పునర్విభజనపై ప్రజలు సూచనలు, సలహాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకటనను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వార్డుల పునర్విభజనపై ఏడు రోజుల్లో ప్రజలు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రకటన పత్రాలను ఉంచామన్నారు. కార్యక్రమంలో టీపీఓ రాజేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదల జీవితాల్లో వెలుగులు

కౌతాళం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ 2.0తో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయపు ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు కోట్రేష్‌గౌడ్ అన్నారు. కౌతాళంలో సోమవారం వారు మాట్లాడుతూ వివిధ వస్తువులపై జీఎస్టీ తగ్గించిన ధరలు అందుబాటులో వచ్చాయని తెలిపారు. తగ్గిన జీఎస్టీ ధరలు ప్రజలకు అందుతున్నాయా లేదా కూటమి నాయకులు పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొమ్మలదిన్నె రమేష్‌గౌడ, సిద్దు, భీమయ్య, సౌద్రి సోమశేఖర్, పుగ్గి నాగ, పంపాలు ఉన్నారు.

కోసిగి: కేంద్ర ప్రభుత్వం వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు ఊరట ఇస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి అన్నారు. సోమవారం ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంపై ఏ వస్తువుపై ఎంత మేర తగ్గిందో ప్రజలకు వ్యాపారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, నాయకులు వక్రాణి వెంకటేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

కోసిగిలో భారీ వర్షం

కోసిగి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. కోసిగిలోని మేజర్ పంచాయతీ కార్యాలయం ముందున్న ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు చెరువు కుంటను తలపిస్తుంది. దీంతో ఉరుకుందకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు.



చాపవంకను దాటుతున్న ప్రజలు

ట్రాక్టర్ బోల్తా

మంత్రాలయం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నపల్లి గ్రామం వద్ద సోమవారం మట్టిపెల్లెల ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో హామాలీలకు త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే మట్టిపెల్లెలు ధ్వంసమయ్యాయి.



బోల్తా పడిన ట్రాక్టర్